క్లుప్తంగా

నేడు 'ఖుషీ ఖుషీగా' కామెడీ సందడి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామ దాసు కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 'ఖుషీ ఖుషీగా'కామెడీ సందడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకుడు, కమెడియన్ మొగిలి గుణకర్ తెలిపారు. గురువారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుణకర్ మాట్లాడుతూ.. హాస్యాన్ని పండించే ఈ కార్యక్రమంలో హైదరాబాద్, గుంటూరు, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన కమెడియన్లు, ఆర్టిస్టులు పాల్గొంటున్నారని, పలు నృత్య ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నందున కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ కన్వీనర్ ముత్తమాల ప్రసాద్, నిర్వాహకుడు, గాయకుడు నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కామేపల్లి: వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం మండలంలోని మద్దిగూడెం సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన ఓ దాబా రెస్టారెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భూక్యా మంగీలాల్, సర్పంచ్ లకావత్ సునీత, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, పుచ్చకాయల సత్యనారాయణ, కిన్నెల నాగయ్య, ఏపూరి మహేందర్, ముక్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఈగా మాధవీలత బాధ్యతలు స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో డీఈఈగా మాధవీలత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కేఎంసీలో ఇద్దరు డీఈఈలను బదిలీ చేయగా.. రామగుండంలో పని చేస్తున్న మాధవీలతను కేఎంసీకి బదిలీ చేశారు. ఈమేరకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా తాలిమ్ మస్తాన్ సందల్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వైరా రోడ్‌లో గల తాలిమ్ మస్తాన్ దర్గాలో గురువారం సందల్ (గంధం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉర్సు కార్యక్రమం శుక్రవారం జరగనున్న నేపథ్యాన దర్గా నిర్వాహకులు (ముజావర్) షేక్ అక్బర్ మున్వర్ పేట మసీదు వద్ద నివాసం నుంచి సందల్ తీసుకొని వైరారోడ్‌లోని తాలిమ్ మస్తాన్ దర్గాకు చేర్చారు. ఈ సందర్భంగా ముజావర్ అక్బర్ మాట్లాడుతూ సుమారు 201 ఏళ్ల నుంచి ఈ ఉర్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెండా, చాదర్ ఖందిల్‌ను తమ నివాసం నుంచి తీసుకొని దర్గాలో చేర్చనున్నామన్నారు.

కుదిరిన ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం మత్స్య సొసైటీ పరిధిలోని చెరువులో చేపల వేట సాగించేందుకు గురువారం సొసైటీ అధ్యక్షుడు ఖాసీం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజారాంపేట, చెరువుమాదారం, రాయగూడెం, మంగాపురంతండాలకు చెందిన సభ్యులు పాల్గొనగా..ఖాసీం మాట్లాడారు. గత సంవత్సరం అనివార్య కారణాల వల్ల బాలు చేపలు పట్టనందున ఏప్రిల్ 30వ తేదీ వరకు అతడికే మరలా అవకాశం కల్పిస్తున్నట్లు సభ్యుల సమక్షంలో సొసైటీ తీర్మానం చేసిందన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కోదండరామ్ నియామకంపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరామ్ ఎమ్మెల్సీగా నియామకం కావడంతో తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ వరదబోయిన బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	ఫైటర్
సాయిరాం	నా సామిరంగ, గుంటూరుకారం
ఆదిత్య	అయలాన్
శ్రీనివాస	కెప్టెన్ మిల్లర్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

పది రోజులకే రహదారుణం





నాణ్యత లోపించడంతో దెబ్బతిన్న బీటీ రోడ్డు (ఇన్‌సెట్) కంకర తేలిన రోడ్డు

బీటీ రోడ్డు పనులపై అధికారుల చిన్నచూపు

- రూ.1.15 కోట్లతో కొత్తలింగాల–జాస్తిపల్లి రెన్యూవల్ బీటీ రోడ్డు నిర్మాణం
- అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు
- నాసిరకంగా వేయడంతో దెబ్బతిన్న రోడ్డు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

కామేపల్లి: అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణమో గానీ అభివృద్ధి పనులు మూన్నాళ్ల ముచ్చటగానే నిలిచిపోతున్నాయి. మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయం నుంచి జాస్తిపల్లి వరకు ఎంఆర్ఆర్ రూ.1.15 కోట్ల నిధులతో రెన్యూవల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం, బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు నిర్మాణం చేపట్టి వారం రోజులు కాకముందే దెబ్బతింటుంది. దీంతో మళ్లీ రోడ్డుపై గుంతలు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిర్మాణంలో నాణ్యత డొల్లతనం..

ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. పనులు జరిగే సమయాన ఆర్అండ్‌బీ అధికారులు లేకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం పట్టుమని పది రోజులు కూడా కాక ముందే రహదారిలో నాణ్యత లోపాలు బయటపడుతున్నాయంటే ఎంత నాసిరకంగా ఉందో ఊహించుకోవచ్చు.

> రహదారులు ప్రగతికి చిహ్నాలు. అలాంటి రోడ్డు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ల కక్కుర్తి.. అధికారుల పర్యవేక్షణ లోపంతో వేయడంతో కొద్ది కాలానికే కంకర తేలి నాసిరకంగా తయారవుతున్నాయి. కొత్తగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో నిబంధలు పాటించకుండా భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఒక పక్క నిర్మిస్తుంటే.. మరో పక్క రోడ్డు దుస్థితి అద్దం పడుతోంది. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు క్వాలిటీ కంట్రోల్ శాఖ తనిఖీలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇంకేముంది.. పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత డొల్లతనం.. అవినీతిమయం కన్పిస్తోంది.

పర్యవేక్షణ అంతంత మాత్రంగానే..

రోడ్డు నిర్మాణ సమయాన అధికారుల పర్యవేక్షణ, పరిశీలన అంతంత మాత్రంగానే ఉంది. దీంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పనులు చేసుకెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు సదరు కాంట్రాక్టర్ పాటించపోవడం వల్లే రోడ్డు దుస్థితి ఇలా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్డు నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులపై నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఇటీవల మండల పర్యటనలో భాగంగా వచ్చిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి జాస్తిపల్లి గ్రామస్తులు తీసుకెళ్లగా సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టిన తర్వాతనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారుల పర్యవేక్షణ లేదు..



రోడ్డు పనులు జరిగే సమయాన సంబంధింత అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. నాణ్యత లేకపోవడంతో రోడ్డు దెబ్బతింది.ఈ విషయాన్ని ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారిని మందలించి తిరిగి రోడ్డు నాణ్యత ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

– దేవండ్ల రామకృష్ణ, జాస్తిపల్లి

నాణ్యత పాటించలేదు..



కొత్తలింగాల–జాస్తిపల్లి బీటీ రోడ్డు దెబ్బతిన్నడంతో రెన్యూవల్ రోడ్డు నిర్మాణం మంజూరు కాగా సదరు కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించలేదు. దీంతో పట్టుమని పది రోజులు కూడా కాలేదు రోడ్డు దెబ్బతింది. ఎలాగైనా తిరిగి సదరు కాంట్రాక్టర్‌తోనే రోడ్డు మళ్లీ నాణ్యమైన రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

– చల్లా శ్రీహరి, జాస్తిపల్లి

మళ్లీ రోడ్డు వేయిస్తాం..

రోడ్డు దెబ్బతిన్న ప్రదేశాల్లో తిరిగి వేయిస్తాం. రెన్యూవల్ బీటీ రోడ్డు కారణంగా పొరపాటు జరిగిన ప్రదేశాల్లో రోడ్డు దెబ్బతింది. అక్కడ దాన్ని తీసేసి మళ్లీ నాణ్యతతో పనులు చేపట్టి పనులను పూర్తి చేయిస్తాం. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా మట్టి తోలకాలు చేపడుతున్నాం. పూర్తికాగానే పనులు చేపడుతాం.

– వాసు, పీఆర్ ఏఈ, కామేపల్లి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



25సికెఎం542: మాట్లాడుతున్న ఏసీపీ శంకర్

ఖమ్మం స్పోర్ట్స్: ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఎంతో అవసరమని సైబర్ క్రైమ్ ఏసీపీ శంకర్ అన్నారు. గురువారం నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో జరిగిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్ నంబర్లు ఎవరికీ షేర్ చేయొద్దని, ఏటీఎం నుంచి నగదు డ్రా చేసేటప్పుడు ఇతరులను తమ వద్దకు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సైబర్ నేరాలపై బాధితులు తమకు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్ రెడ్డి, చైర్మన్ వి.శోభారెడ్డి, ప్రిన్సిపాల్ టి.నాగేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను మండలాల్లోని పోలింగ్ బూత్‌లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేలా ర్యాలీలు, మానవహారం చేపట్టారు. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఓటు విలువ, ప్రాధాన్యతను వివరించారు. నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులు, ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు



ఖమ్మంరూరల్: తల్లంపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఆర్ఓ రాజేశ్వరీ



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు



కామేపల్లి: ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



ఖమ్మంవ్యవసాయం: ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఈ సురేందర్, ఉద్యోగులు



తిరుమలాయపాలెం: పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంప్రసాద్

'ఎస్ఆర్‌బీజీఎన్ఆర్'లో సదస్సు



కమలాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కేరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యాన బుధవారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ప్రముఖ వక్తగా, కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ అరకల కమలాకర్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. అనంతరం కమలాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రమాసత్యవతి, కేరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జ్ సాంబశివరావు, యూజీసీ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఆలిండియా మై చాప్స్ టాలెంట్ టెస్టులో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు నగరంలోని శ్రీనివాసనగర్‌లోని గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్‌లు తెలిపారు. గురువారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులు 129 మంది టాలెంట్ టెస్టుకు హాజరు కాగా 31 మంది విద్యార్థులు సెకండ్ లెవల్‌కు ఎంపికైట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థిని ఎస్.భవ్య రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

నారాయణ ఒలంపియాడ్‌లో 'మాస్టర్ చెఫ్'


ఖమ్మం సహకారనగర్: నగరంలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో గురువారం మాస్టర్ చెఫ్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు మన ఆహార అలవాట్లు, వాటి ప్రయోజనాలు, పాటించకపోతే కలిగే అనర్థాలు వాటి నివారణలను వివరించినట్లు తెలిపారు. పాఠశాల ఏజీఎం వేణుగోపాల్, కో ఆర్డినేటర్ వినోద, సుష్మ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి సిద్ధం

గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం జరగనుండగా నగరంలోని కస్బాబజార్, వైరా రోడ్డులోని దుకాణాల్లో మూడు రంగుల జెండాల అమ్మకాలు ఊపందుకున్నాయి. అలాగే, దండలు, జాతీయ నాయకుల ఫొటోలను కూడా విక్రయిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



జెండాలు, సామగ్రి కొనుగోలు చేస్తున్న స్థానికులు



జాతీయ నాయకుల ఫొటోలు, చిహ్నాలు



మూడు రంగుల్లో శాంతి కపోతాలు

తాగునీటి సమస్య రానివ్వొద్దు..



అధికారులకు సూచనలు చేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: దానవాయిగూడెంలోని మంచినీటి ఫిల్టర్ బెడ్‌ను నగర మేయర్ పునుకొల్లు నీరజ గురువారం సందర్శించారు. మున్నేరు నీటి నిల్వలు తగ్గుతున్నందున నీటి నిల్వలను పెంచుకోవాలని, దీనికి సంబంధించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడాలని కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రానున్న ఎండాకాలంలో నగర ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయాలన్నారు. మున్నేరు ఆనకట్ట మరమ్మతుల పనులు ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కేఎంసీ ఈఈ కృష్ణాలాల్, ఏఈ కుమార్, ఫిల్టర్ బెడ్స్ సిబ్బంది ఉన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరించిన డీపీఓ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీపీఓ, పక్కన నాయకులు

రఘునాథపాలెం: ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను డీపీఓ హరికృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనుముల నరేందర్‌రెడ్డి, పిట్టల మల్లయ్యతో పాటు ఎం.రాజగోపాల్, మంగీలాల్,, ఆర్.కోటేశ్వరరావు, లాలు, రాజు, మేకల రామారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ క్యాలెండర్లు..



ఖమ్మం మామిళ్లగూడెం: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ జేఏసీ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆ సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు పాల్వంచ రామారావు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల్లో అగ్రకులాల వారు బీసీలను అణగదొక్కుతున్నారని, బీసీలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవులు, శ్రీనివాస్, సాయిరాం, నాగచారి, లక్కి కృష్ణారావు, ఎస్.శ్రీనివాస్, దేవేంద్రనాథ్, దుర్గాప్రసాద్, కోటేశ్వరావు, పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు డైరీలు, క్యాలెండర్లు అందజేత



ఎస్ఈకు డైరీ, క్యాలెండర్లను అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) డైరీలు, క్యాలెండర్లను గురువారం సంఘ ప్రతినిధులు విద్యుత్ ఉన్నతాధికారులకు అందజేశారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) ఎ.సురేందర్, టెక్నికల్ డీఈ బాబూరావు, ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్ తదితర డివిజన్ల డీఈలు, అధికారులకు డైరీలు, క్యాలెండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందపాటి సత్యనారాయణ రెడ్డి, వి.సీతారాం గోపాల్, ఆర్.నాగేంద్రకుమార్, జీవీ రామారావు, వెంకట్రామిరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: సుబ్లేడులో ఓ దళితుడి ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన దళితుడు పోలెపొంగు గురవయ్య గత నాలుగేళ్ల క్రితం నిర్మించుకున్న ఇంటిని ఎవరు లేని సమయాన జేసీబీతో పంచాయతీ కార్యదర్శి ఇతర నాయకుల ప్రోద్బలంతో కూల్చివేశారని ఆరోపించారు. ఆ స్థలాన్ని గత 20 ఏళ్ల క్రితం అంగన్‌వాడీ బిల్డింగ్ కోసం దానం చేయగా.. మిగిలిన స్థలంలో గురవయ్య ఇల్లు వేసుకొని నివసిస్తున్నాడని, ప్రభుత్వ స్థలాన్ని చాలామంది ఆక్రమించుకున్నా వాళ్లందరిని వదిలేసి ఈ ఇంటిని కూల్చేయడం దారుణమన్నారు. గురవయ్యకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న, వ్య.కా.సం మండల కార్యదర్శి అంగిరేకుల నరసయ్య, బింగి రమేశ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము మైసయ్య, మల్సూరు, కేవీపీఎస్ నాయకులు పోలుపోగు ముత్తయ్య, పల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంవన్‌టౌన్: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బూత్‌స్థాయి కన్వీనర్ల, ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఉదయం బస్సుల్లో తరలివెళ్లారు. ఈ బస్సులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. రఘునాథపాలెం మండలం నుంచి తరలివెళ్లిన వారిలో ఖమ్మం అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బానోత్ కోటేష్‌నాయక్, ఖమ్మం అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, యూత్ కాంగ్రెస్ చిన్నయ్యనాయక్, కోటేరు నర్సిరెడ్డి, మనోహర్, జంపానాయక్, భద్రు, నరేశ్ తదితరులు ఉన్నారు.